నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ మార్తాండనగర్‌ ఫీడర్‌ పరిధిలో.. మార్తాండనగర్‌, హనీఫ్‌ కాలనీ, ప్రేమ్‌నగర్‌ బి బ్లాక్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

సెప్టెంబర్‌లో భాగ్యనగర్‌ 'టీఎన్జీఓస్‌' వేడుకలు

రాయదుర్గం: భాగ్యనగర్‌ టీఎన్జీఓస్‌ గచ్చిబౌలి హౌసింగ్‌ సొసైటీ సభ్యులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని టీఎన్జీఓస్‌ సెంట్రల్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్‌ మారం జగదీష్‌ స్పష్టం చేశారు. సోమవారం భాగ్యనగర్‌ టీఎన్జీఓస్‌ గచ్చిబౌలి హౌసింగ్‌ సొసైటీ సర్వసభ్య సమావేశం టీఎన్జీఓస్‌ కాలనీలోని సొసైటీ ప్రాంగణంలో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్‌ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌ 3,4 తేదీలలో ఎల్‌బీ స్టేడియంలో టీఎన్జీఓస్‌ 80 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను నిర్వహించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌, కస్తూరి వెంకట్‌, సత్యనారాయణ, హౌసింగ్‌ సొసైటీ కార్యదర్శి జి మల్లారెడ్డి, శ్రీనివాస్‌, రాజేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, ఎం శ్రీనివాస్‌ ,సభ్యులు పాల్గొన్నారు.

హుండీ డబ్బు చోరీ

చందానగర్‌: హనుమాన్‌, శ్రీరాముని ఆలయం లోని హుండీలో డబ్బు ఎత్తుకెళ్లారు. చందానగర్‌ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు... చందానగర్‌ గంగారంలో నివాసించే దొంతి శ్రీధర్‌ ఆదివారం రాత్రి 8.30 గంటలకు పూజ చేసి ఆలయం తలుపులు మూసి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున 4.00కు ఆలయ వాచ్‌మెన్‌ కుమ్మరి రవి వచ్చే సరికి హుండీలు తెరిచి ఉన్నాయి. దీంతో శ్రీధర్‌కు సమాచారం అందించాడు. వారు చందానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 17 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 16 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి, మరో వ్యక్తికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మియాపూర్‌: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన రాజయ్య, అనుసూయల కుమారుడు బల్లా శ్రీకాంత్‌(39) ఉమ అనే మహిళను 2007లో వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు (16) కూతురు (12) ఉన్నారు. భార్యా భర్తల మధ్య గొడవలు, కుటుంబ సమస్యల కారణంగా 6 సంవత్సరాల క్రిందట ఉమా విడాకులు తీసుకుంది. ఈ క్రమంలో మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట కాలనీలో అద్దెకు ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా రెండు రోజులుగా శ్రీకాంత్‌ రూమ్‌కు బయటనుండి గడియ పెట్టి ఉంది. సోమవారం మధ్యాహ్నం రూం నుండి దుర్వాసన రావడంతో స్థానికులు మియాపూర్‌ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. శ్రీకాంత్‌ మృతి చెంది రెండురోజులైనట్లు గుర్తించారు. ముఖం నల్లగా మారి ఉండడం, చెవులు, ముక్కులో నుంచి రక్తస్రావం అవడం, ఓ చేయి విరిగిపోయి నల్లగా కమిలిపోయి ఉండడం గుర్తించారు. ఉప్పల్‌లో ఉంటున్న శ్రీకాంత్‌ సోదరుడు వేణుగోపాల్‌కు సమాచారం అందించారు. నెల రోజుల కిందట రాయలసీమకు చెందిన నాగమణి అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నానని శ్రీకాంత్‌ తన తల్లి అనసూయతో చెప్పినట్లు మృతుడి సోదరుడు వేణుగోపాల్‌ పోలీసులకు తెలిపారు. శ్రీకాంత్‌ మృతిపై అనుమానాలు ఉన్నాయని, మృతుడి సోదరుడు వేణుగోపాల్‌ మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గణేష్‌గడ్డ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండల పరిధి రుద్రారం గణేష్‌గడ్డ సిద్ధి వినాయక ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని గుడి అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిత్య అన్నదానం కోసం కిచెన్‌ తోపాటు.. వివాహాది శుభకార్యాల కోసం కల్యాణమండపం, గుడి ఆదాయం కోసం దుకాణ సముదాయం నిర్మించాలని నిర్ణయించామన్నారు. రాజగోపురం పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు.

'గ్రీన్‌ శేరిలింగంపల్లి' లక్ష్యం

ఈ ఏడాది 2.70 లక్షల మొక్కలు



నల్లగండ్ల హుడా నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిని గ్రీన్‌ సర్కిల్‌గా మార్చడమే లక్ష్యంగా వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రతియేటా వర్షాకాలం వన మహోత్సవాన్ని నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తారు. అందుకోసం నర్సరీలలో రకరకాల మొక్కలు సిద్ధం చేస్తుంటారు. వన మహోత్సవం- 2025 పేరిట శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దఎత్తున మొక్కలు నాటడానికి పార్కులు, రోడ్లు, కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలు, ప్రభుత్వ స్థలాలలో మొక్కలు నాటేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు.



మొక్కల సంరక్షణ బాధ్యత కూడా..

- శేరిలింగంపల్లి సర్కిల్‌లోని మూడు డివిజన్లలో వన మహోత్సవంలో 2.70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు
- ప్రతి ఏటా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షణ కూడా తీసుకుంటున్నారు.
- ఎండిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు
- అల్లనేరేడు, రావి, చింత, మహాగని, కానుగ, నీమ్‌, గుల్‌మొహర్‌, బింగోనియా, రావి తదితర మొక్కలు నాటనున్నారు.

- శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఈ ఏడాది 2.70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ప్రధాన రోడ్లు, కాలనీ రోడ్లపై 95,250 మొక్కలు
- ఇప్పటికే ఉన్న పార్కులు, ఫ్లైఓవర్లపై 45 వేల మొక్కలు
- కొత్త పార్కులలో 89,700 మొక్కలు
- కాలనీ అసోసియేషన్ల వారికి 40 వేల మొక్కలు
- ప్రధాన రోడ్లు, సెంటర్‌లలో పెద్ద మొక్కలు 3600..

మొక్కలు రెడీ..

- వన మహోత్సవానికి కావాల్సిన మొక్కలను శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలోని నర్సరీలలో రెడీగా ఉంచారు
- హెచ్‌ఎండీఏ నర్సరీ, నల్లగండ్ల హుడా కాలనీ నర్సరీల ద్వారా మొక్కలు
- సర్కిల్‌ పరిధిలోని కొండాపూర్‌, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లతో పాటు భెల్‌ ఎంఐజీ కాలనీల్లోని రోడ్లు, పార్కులు, ఇనిస్టిట్యూషన్‌లు, చెరువులు, కుంటలు, శ్మశాన వాటికలు, ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు.

అందరినీ భాగస్వామ్యం చేస్తాం

వనమహోత్సవంలో అందరినీ భాగస్వాములను చేసి విజయవంతం చేయాలన్నదే లక్ష్యం. అందుకోసం నర్సరీలలో మొక్కలను సిద్ధం చేశాం. అందరికీ అందేలా చేస్తాం. గ్రీన్‌ శేరిలింగంపల్లిగా మార్చాలన్న లక్ష్యం విజయవంతం అవుతుంది. వనమహోత్సవానికి గాను 2.70 లక్షల మొక్కలను సిద్ధం చేశాం.

– విక్రమ్‌చంద్ర, మేనేజర్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ, శేరిలింగంపల్లి సర్కిల్‌

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి
- పటేల్‌గూడ పరిధిలో రూ. కోటి పది లక్షలతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో ఒక కోటి పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విలీన గ్రామాల పరిధిలో ఏర్పడుతున్న నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సీఎస్‌ఆర్‌ నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌ కాలనీ మీదుగా సంగమేశ్వర స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ మాజీ చైర్మన్‌ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్‌ మాజీ ఎంపీపీ దేవానంద్‌, మాజీ వైస్‌ చైర్మన్‌ నరసింహగౌడ్‌, మాజీ వైస్‌ ఎంపీపీ సునీత సత్యనారాయణ, మున్సిపల్‌ కమిషనర్‌ జ్యోతిరెడ్డి, డీఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్‌, సీనియర్‌ నాయకులు గోపాల్‌,కృష్ణ, శ్రీకాంత్‌, గోవింద్‌, కాలనీసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, పాల్గొన్న మహిళలు

ఆల్విన్‌కాలనీ: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి వేడుకలలో భాగంగా సోమవారం కూకట్‌పల్లి పట్టణ మహిళా సమాఖ్య పరిధిలోని కూకట్‌పల్లి, హైదర్‌నగర్‌, వివేకానందనగర్‌, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలోని స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఇప్పటి వరకు మహిళా సంఘాలకు 2 కోట్ల 80 లక్షలకు పైగా రుణాలు మంజూరయ్యాయని, ఈ స్కీమ్‌ కింద మహిళలు పెట్రోల్‌ బంక్‌, ఎలక్ట్రికల్‌ బస్‌, సోలార్‌ యూనిట్లు, కిచెన్‌, క్యాటరింగ్‌ వంటి వాటితో లబ్ధి పొందవచ్చన్నారు. గ్రూప్‌ సభ్యులకు రూ.లక్ష నుంచి 20 లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు మహిళలు ఈ గ్రూపుల్లో చేరవచ్చని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ గంగాధర్‌, కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఆఫీసర్‌ రాజశేఖర్‌, నాయకులు సంజీవరెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్‌, పోతుల రాజేందర్‌, ఎండి ఇబ్రహీం, చంద్రమోహన్‌, సాగర్‌, సీఓలు పాపయ్య గౌడ్‌, ముస్తఫా, సుజాత, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

చందానగర్‌: మహిళా సాధికారతకు కాంగ్రెస్‌ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్‌ గౌడ్‌ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్‌ డివిజన్‌ ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ గ్రామం వార్డు కార్యాలయంలో స్వయం సహాయక సమైఖ్య సంఘాల ప్రతినిధులతో కార్పొరేటర్‌ పూజితగౌడ్‌ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా గృహాల నిర్మాణం, ఆరోగ్య భద్రత, విద్య, ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిగౌడ్‌, కనకమామిడి నరేందర్‌గౌడ్‌, డివిజన్‌ అధ్యక్షురాలు రేణుక, సయ్యద్‌ సత్తార్‌ హుస్సేన్‌, సంజుసాగర్‌, కార్తీక్‌ గౌడ్‌, సుధాకర్‌, కృష్ణ, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.



వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి

వడ్డీ మాఫీ హర్షణీయం

చందానగర్‌: డ్వాక్రా రుణాలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడం హర్షణీయమని కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని వేముకుంట మహిళా భవన్‌లో ఇందిరా మహిళాశక్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ -21 పీఓ, మహిళలు పాల్గొన్నారు.

బస్తీల్లో జోనల్‌ కమిషనర్‌ పర్యటన



కాలనీల్లో పర్యటిస్తున్న జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌, కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ బోర్కడే, డిప్యూటీ కమిషనర్‌ వి. ప్రశాంతి, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ సోమవారం పర్యటించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపీనగర్‌, నెహ్రూనగర్‌, లింగంపల్లి, పాపిరెడ్డినగర్‌లలో పర్యటించారు. అసంపూర్తిగా, పెండింగ్‌ పనులను త్వరితగతిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గోపీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌, లింగంపల్లి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌, పాపిరెడ్డినగర్‌ కమ్యూనిటీ హాల్‌, కాలనీలో లింకురోడ్డు, నిర్మించాలని జోనల్‌ కమిషనర్‌కు విన్నవించారు. వెంటనే ప్రణాళికలు రూపొందించాలని జోనల్‌ కమిషనర్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్‌, ఏఎంఅండ్‌ హెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ వెంకటరమణ, అర్బన్‌ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌ అమృతమ్మ, మేనేజర్‌ విక్రమ్‌ చంద్ర పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై జోనల్‌ కమిషనర్‌కు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌కు మదర్‌ సేవా సమితి చైర్మన్‌ బద్దం కొండల్‌ రెడ్డి ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి, చందానగర్‌ సర్కిళ్లలో రెండు ఫ్లోర్‌ల వరకు అనుమతులు తీసుకొని 5 నుంచి 7 అంతస్తుల వరకు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీంతో ఆయా ప్రాంతాల్లోని రోడ్లపై పార్కింగ్‌లు చేస్తున్నారని వివరించారు. దీని వలన స్కూల్‌ బస్సులు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

మియాపూర్‌: జులై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి సీఐటీయూసీ కార్యదర్శి కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు చందు, దానయ్య పిలుపునిచ్చారు. మియాపూర్‌ ఎంఏనగర్‌ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌ కోడ్లను తీసుకురావడం కోసం ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రజలు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుకారం నాయక్‌, రాంబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్‌ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం హెచ్‌సీయూ క్యాంపస్‌ పక్కన ఉండే గోపన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలోని స్టూడెంట్స్‌ ఫర్‌ సేవా యూనిట్‌ పర్యవేక్షణలో పుస్తకాలను అందించారు. 9వ తేదీ ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం పతాకావిష్కరణతో ముగుస్తుందన్నారు. జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాక్షి, బాలకృష్ణ, శివ, దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లీనప్‌ డ్రైవ్‌

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని వైట్‌రాక్‌ ప్రాంతంలో క్లీనప్‌ డ్రైవ్‌ నిర్వహించారు. వ్యర్థాలు, చెత్తాచెదారం , వాటర్‌బాటిళ్ళు తదితరాలను తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

ప్రజావాణి.. 15 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 9 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి తెలిపారు. టౌన్‌ప్లానింగ్‌ 3, ఇంజనీరింగ్‌ 4, శానిటేషన్‌ 1, ఎంటమాలజీ 1 విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు రాగా వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్‌, శానిటేషన్‌, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 6 ఫిర్యాదులు అందజేశారు. ఇంజనీరింగ్‌ విభాగానికి 3, టౌన్‌ప్లానింగ్‌ 2, అర్బన్‌ బయోడైవర్సిటీ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు శ్రవణ్‌ కుమార్‌రెడ్డి, ప్రేమ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

టీ కన్సల్ట్‌ ఆధ్వర్యంలో ఎక్స్‌ పాండ్‌మీ

మాదాపూర్‌: తెలుగు వ్యాపారవేత్తలకు అంతర్జాతీయ వ్యాపార అవకాశాలను అందించేందుకు టీ కన్సల్ట్‌ సంస్థ ఆధ్వర్యంలో ఎక్స్‌పాండ్‌మీ (ఎక్స్‌పాండ్‌ మిడిల్‌ఈస్ట్‌) ప్రతిష్టాత్మక సదస్సును మాదాపూర్‌లోని ట్రిడెంట్‌ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి 150 మందికి పైగా పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్‌ ప్రతినిధులు హాజరయ్యారు. యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ ప్రభుత్వ సంస్థ రాకెజ్‌ (రాస్‌ అల్‌ ఖైమా ఎకనామిక్‌ జోన్‌), వరల్డ్‌ తెలుగు ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ కౌన్సిల్‌ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. తెలుగు వ్యాపార వేత్తలకు రాస్‌ అల్‌ ఖైమా ద్వారా గ్లోబల్‌ మార్కెట్‌లకు ప్రత్యక్ష ప్రధాన్యత లభించనుందని తెలిపారు. టీ కన్సల్ట్‌ బృందంలో డైరెక్టర్‌ భాగ్యలక్ష్మి, యామిని ముద్దుకూరి, శృతికా, మనోసాయి బండారు, భువనా, మానస, సాయి తదితరులు పాల్గొన్నారు.

మద్యంమత్తులో జారి పడి యువకుడు మృతి

గచ్చిబౌలి: మద్యంమత్తులో వాటర్‌ ట్యాంకు పై నుంచి దిగుతూ జారి కింద పడ్డ యువకుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా నర్సరావుపేటకు చెందిన సీహెచ్‌. నరేష్‌(33) రాపిడో బైక్‌ నడుపుతూ గౌలిదొడ్డి కేశవ్‌నగర్‌లోని వినాయక మెన్స్‌ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తన పక్క రూమ్‌లో ఉండే సాయి, సుబ్బారావు అనే యువకులు 5వ అంతస్తుపై ఉన్న వాటర్‌ ట్యాంకుపై కూర్చుని మద్యం సేవిస్తున్నారు. నరేష్‌ అక్కడే కూర్చుని మాట్లాడుతూ మద్యం సేవించాడు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో సాయి, సుబ్బారావు వెళ్లారు. నరేష్‌ అక్కడే కూర్చున్నాడు. కాగా ఉదయం హాస్టల్‌లో ఉండే వెంకట నిథిన్‌ అనే యువకుడు ఆరేసిన బట్టలు తీసుకునేందుకు రాగా స్లాబ్‌పై నరేష్‌ పడి ఉండటాన్ని గమనించాడు. పిలిచినా పలుకకపోవడంతో హాస్టల్‌ నిర్వాహకులకు సమాచారం అందించగా వారు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత మృతికి గల కారణాలు తెలిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలూ జాగ్రత్త...

- సున్నం చెరువులో ఈత కొడుతున్న చిన్నారులు
- అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలి



సున్నం చెరువులో ప్రమాదకరంగా ఈత కొడుతున్న చిన్నారులు, యువకులు

మోతీనగర్‌: సున్నం చెరువులో పిల్లలు ప్రమాదకరంగా ఈత కొడుతున్నారు. ఓ పక్క జేసీబీలు, భారీ యంత్రాల ద్వారా సుందరీకరణ పనులు సాగుతున్నాయి. ఇక్కడ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని అల్లాపూర్‌, లింగంపల్లి మండలాల పరిధిలోని సున్నం చెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా చెరువు పూడిక తీశారు. ఐతే ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండటంతో స్థానిక యువత, విద్యార్థులు చెరువులో ఈత కొడుతున్నారు. సమీప బస్తీలైన పద్మావతినగర్‌, గాయత్రినగర్‌, మేరాజ్‌నగర్‌, అజీజ్‌ నగర్‌లతో పాటు పరిసర ప్రాంత యువత, చిన్నారులు చెరువులోకి దిగుతున్నారు. చెరువు వద్ద పనులు జరుగుతున్న క్రమంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. గతంలో చిన్నారులు చెరువుల్లో, గుంతల్లో పడి మృత్యువాత పడిన సంఘటనల నేపథ్యంలో చెరువు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో సెక్యూరిటీ ఉన్నా ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. హైటెక్‌ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఈ సున్నం చెరువు పనులు పూర్తి అయ్యేంత వరకు సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ, బస్తీవాసులు కోరుతున్నారు.



చెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులు